క్రీడలతో సమష్టితత్వం పెరుగుదల

ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్

క్రికెట్ ఆడుతున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : క్రీడతో సమష్టితత్వం పెరుగుతుందని ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మానుకోట సబ్ డివిజన్ పోలీస్ టీమ్, తొర్రూరు సబ్ డివిజన్ టీమ్‌లు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానసిక, శారీరక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతగానే ఉపయోగపడుతాయని చెప్పారు. పోలీస్ ఉద్యోగులు ఎన్నో సవాళ్లతో పనిచేయాల్సి ఉంటుందని, కర్తవ్య నిర్వహణలో రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో క్రీడలు నిత్య జీవితంలో మానసిక దృఢత్వానికి తోడ్పాటును అందిస్తాయన్నారు. మానుకోట సబ్ డివిజన్ టీమ్ 12 ఓవర్లకు 90 పరుగులు చేయగా, తొర్రూరు జట్టు 91 పరుగులు చేసి విజయం సాధించింది.

గుడుంబా స్థావరాలపై దాడి

దంతాలపల్లి, మార్చి 24: మండలంలోని పలు గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై పోలీసులు ఆదివారం దాడులు చేశారు. కుమ్మరికుంట్లలో ఆరు లీటర్లు, బొడ్లడాలో 10 లీటర్లు, ఆగపేటలో 10లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కరుణాకర్ వివరించారు. గుడుంబా తయారు చేస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దోనకొండలో రైతుల దీనావస్థ

- బోర్లలో తగ్గిన జలాలు.. కాల్వల్లో అందని నీళ్లు
- సాగునీరు లేక ఎండుతున్న పంటలు

దోనకొండ శివారులో ఎండిన వరిపంటను చూపుతున్న రైతు బాబు

దంతాలపల్లి, మార్చి 24: భూగర్భజలాలు అడుగంటి బోర్లలో నీరు లేక వరి, మక్కజొన్న, తదితర పంటలు ఎండిపోతున్నాయి. సాగునీరు పుష్కలంగా వస్తాయనే ఆశతో మండలంలోని రైతులు యాసంగి సీజన్‌లో ఎక్కువగా వరి సాగుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీరు అందించకపోవడంతో బోర్లలో నీరు తగ్గి పంటలు ఎండిపోతుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని దోనకొండలో రైతు బుదారపు బాబు తన రెండు ఎకరాల 30గుంటల్లో వరి సాగుచేశాడు. కాలువల్లో నీరు రాకపోవడంతో బోర్లలో ఊటలు తగ్గాయి. దీంతో వరి పంట ఎండిపోయిందని తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఏ అవిలయ్య వరి పంట కూడా ఎండిపోయినట్లు తెలిపారు. చేసేదేమీ లేక ఆయా రైతులు పొలాలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మల్లారెడ్డి

టెట్ ఫీజును తగ్గించాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫీజును వెంటనే తగ్గించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక టీఎస్ యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టెట్ పరీక్ష ఫీజు రూ. వెయ్యికి పెంచడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వంలో ఒక్క పేపర్‌కు రూ.300 ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.వెయ్యి చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. యాకూబ్, నాగమల్లయ్య, వివేక్ పాల్గొన్నారు.

మీడియా సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మీడియా సెంటర్‌ను పరిశీలించిన కలెక్టర్

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంతో సమీకృత కలెక్టరేట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన మీడియా పాయింట్‌ను ఆదివారం కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇచ్చేందుకు, వివిధ రాజకీయపార్టీల ప్రచార అనుమతుల కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ, మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్,నోడల్ అధికారులు, ఏఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లింల మండల సంఘం ఎన్నిక

ఖాదర్

కేసముద్రం, మార్చి 24: ముస్లింల మండల సంఘం అధ్యక్షుడిగా షేక్ ఖాదర్ ఎన్నికయ్యారు. మండలంలోని కేసముద్రం విలేజీ మసీదులో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా షేక్ మైబు సుభాని, సయ్యద్ ఖాదర్, మహ్మద్ యాకుబ్‌పాషా, షేక్‌సర్వర్, ప్రధాన కార్యదర్శిగా షేక్ నయీం, సహాయ కార్యదర్శులుగా మహ్మద్ అంకూస్, గఫార్, షేక్ భాషుమియా, మహ్మద్ యాకుబ్ పాషా, కోశాధికారిగా షేక్ అక్బర్, గౌరవ సలహాదారులుగా మహ్మద్ హఫీజ్, షేక్‌జావెద్, సభ్యులుగా సయ్యద్, జావెద్, మహ్మద్ రఫీ, సబీసాబ్, ఖాజా, తాజుద్దీన్, సలీం పాషా, అమీర్ ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పార్నంది రామయ్య

ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా జరుపుకోవాలి

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : ఏప్రిల్‌ను మహనీయుల మాసంగా జరుపుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని నలంద కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక సమానతకు బాబూ జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతులను ఘనంగా నిర్వహించాలన్నారు. సమాజంలో కుల అసమానతలు, అంటరానితనాన్ని దూరం చేసి ఆరోగ్య జీవితం కోసం జీవితాలను త్యాగం చేశారని తెలిపారు. కార్యక్రమంలో బద్రీనాయక్, మహేందర్, లాలు, వెంకటేశ్వర్లు, దేవ్‌సింగ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చెరువు మట్టి తోడేస్తున్నారు

దంతాలపల్లి, మార్చి 24: మండల కేంద్రంలోని ప్రభుత్వ భూమిలో మట్టిని తోడేస్తున్నారు. స్థానిక పెద్ద చెరువులో కొందరు రెండు జేసీబీలతో తోడి వందల ట్రాక్టర్ల మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తహసీల్దార్, పోలీస్టేషన్‌కు కూతవేటు దూరంలోని చెరువులో మట్టి తోడి విక్రయిస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఐబీ శాఖ అధికారులకు ముడుపులు చెందుతున్నాయని ఆరోపణలు సైతం ఉన్నాయి.

డబ్బులు ఇవ్వలేదని ఇంటికి నిప్పుపెట్టిన కొడుకు

నెక్కొండ, మార్చి 24: తాను చేసిన అప్పులు తీర్చేందుకు తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వడం లేదని ఆగ్రహంతో కొడుకు ఇంటికి నిప్పంటించిన ఘటన నాగారంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. నాగారానికి చెందిన కుమ్మరి వెంకన్న–ఐలమ్మ దంపతులు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లారు. వారి కుమారుడు మధుకు స్వప్నతో వివాహమైంది. అందరూ హైదరాబాద్‌లోనే ఉంటున్నారు. అక్కడే పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్న మధుకు వ్యక్తిగత కారణాలతో రూ. లక్షన్నర వరకు అప్పులయ్యాయి. వాటిని తీర్చేందుకు డబ్బులు ఇవ్వాలంటూ మధు తన తల్లిదండ్రులను వేధిస్తున్నాడు. తమ బంధువుల ఇంట్లో జరుగనున్న వేడుక కోసం రెండు రోజుల క్రితం మహబూబాబాద్ జిల్లాలోని కంబాలపల్లికి అందరూ వెళ్లారు. అక్కడ కూడా డబ్బుల విషయంలో తల్లిదండ్రులతో మధు గొడవపడ్డాడు. కోపంతో మధు శనివారం రాత్రి తమ సొంత గ్రామమైన నాగారానికి చేరుకున్నాడు. ఆదివారం ఉదయం తమ ఇంటి సమీపంలోని బైక్ నుంచి పెట్రోల్ తీసి ఇంటిపై పోసి నిప్పంటించాడు. ఈ ఘటనతో ఇంట్లోని వస్తువులు, సామగ్రి కాలిపోయి రూ. 50 వేల ఆస్తినష్టం జరిగింది. ఈ ఘటనపై ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా తమనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

నేటి నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

హసన్‌పర్తి, మార్చి 24 : భీమారంలోని స్వయంభూ ఎర్రగట్టు గుట్ట వేంకటేశ్వరస్వామి జాతర బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. హోలీ పర్వదినం నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ జాతరకు మేకపోతుల బండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. నేటి రాత్రి 10 గంటలకు భీమారంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి రథాలపై స్వామివారు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్ల ప్రతిమలను ఊరేగింపుగా ఎర్రగట్టుగుట్ట ఆలయానికి తీసుకెళ్లి కల్యాణం జరిపించనున్నారు. దీంతో జాతర ప్రారంభమవుతుంది. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో కిషన్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

దామెర, మార్చి 24 : మండలంలోని ఓగులాపురం సమీపంలోని పరకాల మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీలత ఆదివారం తెలిపారు. 5వ తరగతి ఇంగ్లిష్ మీడియం, ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ, ఎంఈసీ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 6,7,8వ తరగతుల కోసం మైనార్టీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 799505 798 1, 9989416061,9963802350 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రాత్రికి రాత్రే శ్మశానవాటికకు తరలింపు

- తమ ఇంటి వద్ద మృతదేహం ఉంచొద్దన్న యజమాని
- ఇంటి స్థలం పట్టా ఇచ్చినా నిష్ప్రయోజనం
- కేసముద్రం విలేజీలో ఘటన

శ్మశాన వాటికలో రుక్కమ్మ మృతదేహంతో కుటుంబ సభ్యులు

ఇంటి స్థలం పట్టా చూపుతున్న ఉపేంద్ర

కేసముద్రం, మార్చి 24 : మండలంలోని కేసముద్రం విలేజీకి చెందిన రంగోజు రుక్కమ్మ(82) అనారోగ్యంతో మృతి చెందగా, మృతదేహాన్ని ఆదివారం శ్మశాన వాటికలోనే ఉంచాల్సి వచ్చింది. నిరుపేద రుక్కమ్మకు టుంబానికి ఇంటి స్థలం లేకపోవడంతో కేసముద్రంలో ఓ ఇంట్లో కిరాయికి ఉంటూ జీవిస్తున్నారు. ఆమె శనివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందగా ఇంటి యజమాని మృతదేహాన్ని తమ ఇంట్లో ఉంచొద్దని చెప్పాడు. దీంతో మృతదేహాన్ని రాత్రే శ్మశానవాటికకు తరలించారు. అంత్యక్రియలకు అంతర్యామి స్వచ్ఛంద సేవా సంస్థ రూ.8వేల ఆర్థికసాయం అందించింది. రుక్కమ్మ భర్త వీరయ్య గతంలోనే మృతిచెందాడు. ఏడాది కింద కొడుకు సాంబయ్య మృతిచెందగా మృతదేహాన్ని తన ఇంటి వద్ద ఉంచొద్దని ఇంటి యజమాని చెప్పగా శ్మశాన వాటికకు తరలించారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వం మ హమూద్‌పట్నం పరిధిల 75 గజాల స్థలానికి సంబంధించిన పట్టాను కోడలు ఉపేంద్రకు అందించారు. మరో 45 మంది నిరుపేద కుటుంబాలకు కూడా పట్టాలు వచ్చాయి. కొందరు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ భూమి తమదేనంటూ గ్రామానికి చెందిన కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించారు. ఇరువర్గాల మధ్య సమస్యగా మారడంతో అధికారులు జోక్యం చేసుకొని కేసీఆర్ ప్రభుత్వం ద్వారా పట్టాలు పొందిన వారి ఇళ్ల నిర్మాణ పనులను నిలిపేశారు. ఇంటి నిర్మాణ పనులకు అనుమతులివ్వాలని పలుమార్లు లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఇప్పుడు రుక్కమ్మ మృతదేహాన్ని శ్మశాన వాటికలో వేయడంతో మహమూద్‌పట్నంలో కేటాయించిన స్థలాన్ని ఉపేంద్రకు ఇవ్వడం సరైనదేనని, అధికారులు స్పందించి 45మందికి వెంటనే ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కాల్వలు తవ్వించింది కాంగ్రెస్సే..

ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

పెద్దవంగర, మార్చి 24 : వ్యవసాయానికి సాగునీరు అందించేందుకు కాల్వలు తవ్వించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బొమ్మకల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి చెన్నూరు రిజర్వాయర్ వరకు కాంగ్రెస్ హయాంలోనే కాల్వలు తవ్వించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క కాల్వ తవ్వించలేదన్నారు. పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ పనులు ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఝాన్సీరెడ్డి, నెహ్రూనాయక్, హరిప్రసాద్, రాజశేఖర్, సురేశ్, సైదులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ

తొర్రూరు, మార్చి 24: డీఎస్సీకి సన్నద్ధమవుతున్న నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు రెండు నెలల పాటు రెసిడెన్షియల్‌తో కూడిన ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు గూడెల్లి మధు తెలిపారు. మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు చెందిన అభ్యర్థులకు హనుమకొండలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీఈడీ, టెట్‌లో ఉత్తీర్ణత సాధించి, డీఎస్సీలో ఏదైనా ఒక సబ్జెక్టుకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ శిక్షణ ఉంటుందని, ఈనెల 26వ తేదీలోగా tsstudeycircle.com వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉయ్యాలబాలుడు కాసాలనాయుడు పండుగ వద్ద పీసా కో ఆర్డినేటర్ ప్రభాకర్, ప్రొఫెసర్ నిర్మల, ఆలయ పూజార్లు

ఆదివాసీల పండుగలను ప్రభుత్వమే నిర్వహించాలి

గంగారం, మార్చి 24: ఆదివాసీల కోయ ఇలువేల్పుల పండుగలను ప్రభుత్వమే నిర్వహించాలని పీసా ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కొమరం ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని గుడిపాడులో చింత వంశీయులు నిర్వహిస్తున్న ఉయ్యాల బాలుడు కాసాలనాయుడు గిరిజన ఆదివాసీల పండుగను ప్రొఫెసర్ నిర్మల ఆదివాసీ తుడుందెబ్బ నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీల ఇలువేల్పుల పండుగలకు ప్రభుత్వం నిధులు కేటాయించి ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడాలన్నారు. జేఎన్ఏఎఫ్‌యూ హైదరాబాద్, పరిశోధన విద్యార్థులు సుజిత్, చాకి, తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదగిరి, ఆలయ పూజార్లు చింత రవి, చింత వజ్జయ్య, చింత సతీష్, పీసా మండల అధ్యక్షుడు ఈక సురేందర్ పాల్గొన్నారు.

బావిలో పడి పశువుల కాపరి మృతి

బయ్యారం, మార్చి 24: పశువుల కాపరి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతిచెందిన ఘటన మండల కేంద్రం శివారులో ఆదివారం జరిగింది. ఎస్సై మౌలీనా తెలిపిన వివరాల ప్రకారం.. వెంకట్రాంపురం గ్రామానికి చెందిన కందుకూరి వీరన్న(40) బయ్యారంలో గేదెలు కాసేవాడు. రోజూ మాదిరిగానే గేదెలు కాస్తూ ఊరు శివారులోని బావి వద్ద కూర్చోగా ప్రమాదవశాత్తు జారి అందులో పడ్డాడు. నీటి మునిగి ఈత రాకపోవడంతో మృతిచెందాడు. స్థానికులు గమనించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన పీడీఎస్ బియ్యం లోడ్ లారీతో పోలీసులు

పీడీఎస్ బియ్యం పట్టివేత

తొర్రూరు, మార్చి 24: మున్సిపల్ కేంద్రంలోని దుబ్బతండా వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా లారీలో తరలిస్తున్న రూ.4.9లక్షల విలువైన 24.5 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని సీజ్ చేసినట్లు ఎస్సైలు కే జగదీశ్, పీ రాజు ఆదివారం తెలిపారు. మహబూబాబాద్ నుంచి మరిపెడ హైవే రూట్‌లో పీడీఎస్ బియ్యాన్ని లారీలో మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నారు. డ్రైవర్ మనోజ్ ధర్మాదాస్‌ను గులాడే ద్వారా ప్రచారాన్ని సేకరించి లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ పల్టీ కొట్టి డ్రైవర్ మృతి

అశోక్(ఫైల్)

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : ట్రాక్టర్ పల్టీ కొట్టి కెనాల్‌లో పడగా డ్రైవర్ మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన ఆలకుంట్ల చెన్నయ్య, సాయమల్లమ్మ కుమారుడు అశోక్ (19) ఓ యజమాని వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.ఆదివారం తెల్లవారుజామున మట్టి తరలించేందుకు వెళ్తుండగా పల్టీ కొట్టి కెనాల్‌లో పడింది. దీంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ట్రాక్టర్‌కింద పడి బాలుడికి తీవ్ర గాయాలు

నర్సంపేట రూరల్, మార్చి 24: ట్రాక్టర్ ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన గుంటూరుపల్లి గ్రామ శివారు భీమ్లాతండాలో ఆదివారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. లక్నేపల్లికి చెందిన కత్తి రాజు కుమారుడు హర్షవర్ధన్(బిట్టు) 2వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు రోజు కావడంతో బాలుడు మరో నలుగురు స్నేహితులతో కలిసి ట్రాక్టర్‌లో సరదాగా భీమ్లాతండాకు వెళ్లారు. అక్కడ కంకర తీసుకొని తిరిగి లక్నేపల్లికి బయల్దేరారు. మార్గమధ్యంలో హర్షవర్ధన్ ట్రాక్టర్ పైనుంచి కిందకు దూకగా ట్రాక్టర్ టైరు అతడి తొడ పైనుంచి వెళ్లింది. దీంతో తీవ్ర గాయంతోపాటు రక్తస్రావమైంది. స్థానికులు గమనించి బాలుడిని వరంగల్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

మహబూబాబాద్ రూరల్: ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మహబూబాబాద్ రూరల్, మార్చి 24 : అనంతాద్రి శ్రీ జగన్నాథ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రహ్మోత్సవాల్లో భాగంగా పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. సౌమిత్రి హేమంత్ ఆచార్యులు యాజ్ఞిక నిర్వహణలో జరిగింది. అనంతాద్రి దేవాలయ ట్రస్ట్ చైర్మన్ నూకల రామచంద్రారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు గొడవర్తి చక్రధరాచార్యులు, శ్రవణ్, కుమారాచార్యులు, విజయ్ పాల్గొన్నారు.

నర్సింహులపేట: కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా తిరుపతమ్మ, గోపయ్య కల్యాణం

నర్సింహులపేట: మండల కేంద్రంలో తిరుపతమ్మ తల్లి దేవాలయంలో శనివారం రాత్రి తిరుపతమ్మ, గోపయ్య కల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణంలో డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రునాయక్, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి వేర్వేరుగా పాల్గొన్నారు. అర్చకుడు మహేశ్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణంలో భక్తులు బోనాలు సమర్పించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండ భిక్షంరెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంకన్నస్వామికి రెండోరోజూ పూజలు

నర్సింహులపేట మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రిపై వెలిసిన శ్రీపద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం సందర్భంగా ఆదివారం రెండోరోజు అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పూజ కార్యక్రమాలను అర్చకులు కేశవాచార్యులు, నర్సింహచార్యులు, నందనాచార్యులు, రామాచార్యులు నిర్వహించారు. భక్తులు రూ.2వేలు చెల్లించి కల్యాణం లో పాల్గొనవచ్చని ఈవో వేణుగోపాల్ తెలిపారు. భక్తులకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం, వైద్య సౌకర్యం ఏర్పాటు చేశారు. దేవస్థాన జూనియర్ అసిస్టెంట్ శేఖర్ ఉన్నారు.

'వంద రోజుల పాలనలో కాంగ్రెస్ విఫలం'

తొర్రూరు, మార్చి 24: వంద రోజుల పాలనలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా వైఫల్యమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి లేగా రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డివిజన్ కేంద్రం లో ఆ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. పాలకుర్తి నియోజకవర్గ ప్రజలకు ఝాన్సీరెడ్డి, యశస్వినీరెడ్డి నాయకత్వంపై విశ్వాసం తగ్గిపోతోందని, పాలకుర్తి ప్రజలు పెనం మీది నుంచి పొయ్యిలో పడినట్లయ్యిందని ఎద్దేవా చేశారు. బీజేపీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ సుంకరనేని కోటేశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కన్నయ్య, జిల్లా నాయకులు రంగు రాములు, సాయిని ఝాన్సీ, తొర్రూరు అర్బన్, రూరల్ అధ్యక్షుడు పల్లె కుమార్, అధ్యక్షుడు బొచ్చు సురేశ్, ప్రధాన కార్యదర్శి పైండ్ల రాజేశ్, బేడ బుడుగ జంగం జాతీయ నాయకులు కిన్నెర యాదగిరి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు మంగళపల్లి యాకయ్య, జిల్లా, మండల నాయకులు నవీన్‌రెడ్డి, గడల శేఖర్, గట్ల భరత్, నూనె అనిల్, నవీన్, విజయ్‌కుమార్, వినయ్ శర్మ, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఐక్యర్యాలీలు

గార్ల/దంతాలపల్లి, మార్చి 24: మండల కేంద్రంలో సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల ఐక్యర్యాలీని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. నెహ్రూ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ చేపల మార్కెట్, గాంధీపార్క్, బ్యాంక్ సెంటర్, మసీద్ సెంటర్ మీదుగా సీఎస్ఐ చర్చికి చేరుకున్నారు. డప్పువాయిద్యాలతో పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. జెరూసలెం పట్టణానికి వచ్చిన సందర్భంగా మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహిస్తామని చర్చి ఫాదర్ జానరాజు తెలిపారు.

గార్ల: ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

దంతాలపల్లిలో..

సంఘం పెద్దలు యేసుమణి, రవితేజ, జ్యోత్స్న, డేవిడ్, జాన్‌రాజు, సంపత్, మహేశ్, బన్నీ పాల్గొన్నారు. దంతాలపల్లి మండలంలోని పెద్దముప్పారంలో క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈత చెట్టు ఆకులు పట్టుకొని ప్రార్థనలు చేస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థన చేశారు. పాస్టర్లు డేవిడ్, సంజీవరావు, రజిత, భాగ్యమ్మ, మనోరంజని పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

jobs Apply Now!

SepTeK

★HNK లగ్జరీ ఎంటర్ ప్రైజెస్ వెయ్యి స్తంభాల గుడి ప్రక్కన Air Coolor & ఫర్నిచర్ షాపులో పని చేయడానికి సెల్స్ గర్ల్స్, సెల్స్ బాయ్స్, సూపర్ వైజర్, హెల్పర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. సంప్ర:9347881523.
NTW-321500

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

HMDA & RERA PLOTS

★3-5 సంవత్సరాలలో Future City

బీబీనగర్‌లో 200 ఎ॥ AIIMS హాస్పిటల్ దగ్గర్లో HMDA & RERA ప్లాట్లు 60% లోన్‌తో గేటెడ్ కమ్యూనిటీలో కలవు: 8109994456.
NT-320386

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవ